ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన కల్పించాలి


ఆర్టీఓను కలిసిన డీఎం

చాంద్రాయణగుట్ట: జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా దక్షిణ మండలం ఇన్‌చార్జి ఆర్టీఓ కిష్టయ్యను ఫలక్‌నుమా ఆర్టీసీ బస్సు డిపో మేనేజర్ ఎస్.రమేష్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్టీఓ మాట్లాడుతూ..ఆర్టీసీ డ్రైవర్లు రహదారి నిబంధనలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండేలా వారికి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా బస్సులను బస్టాప్‌లలోనే నిలపడం, సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంకన్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండేలా చూడాలన్నారు. దీంతో పాటు డ్రైవర్ల ఆరోగ్యానికి సంబంధించి ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించి వారిని ప్రోత్సహించాలన్నారు.

'భూపాల్‌రెడ్డిపై దాడి అమానుషం'

జియాగూడ: నల్గొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిపై దాడి అమానుషమని కార్వాన్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి జీవన్‌సింగ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అనుచరులు, నల్గొండ మున్సిపల్ చైర్మన్‌లు భూపాల్‌రెడ్డిపై భౌతికంగా దాడి చేయడంతో సొమ్మసిల్లి పడిపోయాడని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ 10 ఏళ్లల్లో కేవలం అభివృద్ధి చేసిందని ఇతరులపై దాడులు చేయలేదని పేర్కొన్నారు.

ఇన్‌స్పెక్టర్ మారుతీ ప్రసాద్‌కు గోల్డ్‌మెడల్


బాక్సింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన మారుతీప్రసాద్

అఫ్జల్‌గంజ్: హైదరాబాద్ సిటీ పోలీస్ యాన్యువల్ స్పోర్ట్స్ మీట్–2025 బాక్సింగ్ పోటీల్లో సీటీసీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ కాసుల మారుతీప్రసాద్ గోల్డ్ మెడల్ సాధించారు. 80 నుంచి 85 కిలోల కేటగిరిలో మంగళవారం జరిగిన బాక్సింగ్ పోటీల్లో విజేతగా నిలిచి గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ..విధుల్లో ఎంతో బిజీగా ఉండే పోలీసులకు క్రీడా పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. నిరంతరం ప్రతిరోజూ కొంతసేపైనా క్రీడలకు సమయం కేటయించి క్రీడా విభాగంలో రాణిస్తున్నట్లు తెలిపారు.

మాజీ మంత్రి సత్యనారాయణకు నివాళి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర సాధనే జీవిత ఆశయంగా ఇదివరకు పోరాడిన వ్యక్తి సంగం రెడ్డి సత్యనారాయణ అని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన చేసిన సేవలకుగాను సత్యనారాయణ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ క్రాంతిదళ్ ఆధ్వర్యంలో వాగ్గేయ కళాకారుడు, మాజీ మంత్రి సత్యనారాయణ 92వ జయంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ, అరుణోదయ సాంస్కృతిక మండలి వ్యవస్థాపకురాలు విమలక్క మాట్లాడుతూ.. సత్యనారాయణ కవిగా, గాయకుడిగా, జర్నలిస్టుగా వివిధ బాధ్యతలు నెరవేరుస్తూనే తెలంగాణ కోసం విశేషంగా కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సమాచార హక్కు మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్, సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, జానపద కళాకారులు ఏపూరి సోమన్న, దరువు ఎల్లన్న పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్



అబిడ్స్: ఇంటి తాళాలు పగులగొట్టి ఓ ఇంట్లోకి ప్రవేశించి చోరీ చేసిన నిందితులను గుడిమల్కాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కుల్సుంపురా డివిజన్ ఏసీపీ మునావర్, ఇన్‌స్పెక్టర్ బి.రాజు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని భోజగుట్ట వివేకానందనగర్‌లో నివసించే ఉప్ప కృష్ణ ఈ నెల 13న తన ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి ఊరికి వెళ్లారు. 16న తిరిగి వచ్చిన కృష్ణ ఇంటి తాళం తీసి ఉండడం చూసి బీరువాలో ఉన్న నగదు, బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని గుర్తించాడు. రూ.3 లక్షల నగదు, 4 తులాల బంగారం, వెండి చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మంగళవారం గుడిమల్కాపూర్ మార్కెట్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న భోజగుట్టకు చెందిన పవన్, టోలీచౌకికి చెందిన సయ్యద్ ఆజాంలను అదుపులోకి తీసుకొని విచారించారు. దొంగతనం వారే చేసినట్లు ఒప్పుకున్నారు. వీరి వద్ద రూ.1.87 లక్షల నగదుతో పాటు 42 గ్రాముల బంగారు ఆభరణాలు, 756 గ్రాముల వెండి వస్తువులను స్వాధీన పరచుకున్నారు. ఈ కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణించేదెలా..?


జియాగూడ నుంచి కేసరి హనుమాన్‌కు వెళ్లే చౌరస్తా..


జియాగూడ మేకలమండి చౌరస్తాలో పారుతున్న మురుగు

- అధ్వానంగా జియాగూడ నుంచి కేసరి హనుమాన్ రోడ్డు
- రోడ్డుపై పారుతున్న మురుగు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

జియాగూడ: జియాగూడ మేకలమండి గేట్ నుంచి కేసరి హనుమాన్ చౌరస్తా 2జీ బస్‌స్టాండ్ వరకు సమస్యలు పోటీ పడుతున్నాయి. ఈ రహదారిలో రోడ్డు అధ్వానం, ఎప్పుడూ మురుగునీరు డ్రైనేజీ నాలాలోకి బదులు రోడ్డుపై ఏరులై పారుతోంది. సంవత్సరాల తరబడి నిర్మించిన నాలా పనులతో ఇబ్బందులు కాగా తిరిగి మరోసారి వాటర్‌లైన్ నిర్మాణం పనులు నెలల తరబడి జరిగాయి. ఇది కూడా ఎట్టకేలకు పూర్తి కాగా తిరిగి డ్రైనేజీ లైన్‌లు నిండి రోడ్డుపై పారుతోంది. ఇక ఇన్ని పనులు జరిగినా నూతన రోడ్డు మాత్రం పడలేదు. అధికారులు, ప్రజా ప్రతినిధుల మధ్య సమన్వయ లోపం కారణంగా ప్రయాణికులు, పాదచారులు, వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు చుట్టుపక్కనే ఉన్నప్పటికి సమస్య ఎందుకు పరిష్కారం కావడం లేదని ప్రజలు బహటంగా విమర్శిస్తున్నారు.

ఆర్టీసీ బస్సుల రాకపోకలకు అంతరాయం..

ప్రతిరోజూ జియాగూడ నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలు జియాగూడ కేసరి హనుమాన్ 2జీ బస్టాండ్ నుంచి కొనసాగుతాయి. ప్రయాణికులు ఎక్కువ శాతం 2జీ బస్టాండ్, జియాగూడ కమేళా, కుల్సుంపురా పోలీస్ క్వార్టర్స్, సబ్జిమండి, భగత్ సింగ్ చౌరస్తా మీదుగా పురానాపూల్ ఇతర ప్రాంతాలకు రాకపోకలు కొనసాగుతుంటాయి. జియాగూడ మేకలమండి రోడ్డులోని సమస్యల కారణంగా బస్సులను పురానాపూల్ జాతీయ రహదారి మీదుగా బస్‌స్టాండ్‌కు బస్సులు నడుస్తున్నాయి. దీంతో ప్రయాణికులు పురానాపూల్ చౌరస్తా వరకు నడ్చుకుంటూ బస్సులను ఎక్కుతున్నారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడటంతో పాటు ఆర్టీసీకి నష్టం వస్తుంది. ఈ ప్రాంతాల్లో ఎక్కువ శాతం దినసరి కూలీలు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చార్మినార్ సీబీడీఏడీ ఒక ప్రకటనలో తెలిపారు. షంషీర్ గంజ్ విద్యుత్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫైన్ బాగ్, షంషీర్ గంజ్, గోశాల, అలీనగర్, హమాల్వాడి, ఘాజీ బండ, అలియాబాద్, ఫూల్‌బాగ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాల అంతరాయం ఉంటుందన్నారు. సత్తార్ బాగ్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు సత్తార్ బాగ్, చన్నీకిబట్టి, ఘాజీ బండ, బడి గుమ్మాస్, ఫూల్ బాగ్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. రూప్ లాల్ బజార్ విద్యుత్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రూప్‌లాల్ బజార్, శక్కర్ గంజ్, లాల్ దర్వాజా మోడ్, శాలిబండ పోస్ట్ ఆఫీస్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఎంజేమార్కెట్ విద్యుత్ ఫీడర్ పరిధిలో..

అఫ్జల్‌గంజ్: 11 కేవీ ఎంజేమార్కెట్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని కరాచి బేకరి, రిజిస్టర్ కార్యాలయం, పోస్ట్ ఆఫీస్ లైన్, మాలకుంట తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే ఆర్‌ఎస్ ఆలయం విద్యుత్ ఫీడర్ పరిధిలోని టోలీ మజీద్, సబా హోటల్, మొగల్‌కా నాలా తదితర ప్రాంతాల్లో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు..ఈఎన్టీ ఆసుపత్రి ఫీడర్ పరిధిలోని బడీ చౌడీ, ఎంసీహెచ్ బల్డింగ్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

అరుదైన రామచిలక పిల్లలు 'జూ'కు అందజేత


రామచిలుక పిల్లలను పరిశీలిస్తున్న ఫారెస్ట్ అధికారులు

చార్మినార్: మహమ్మద్ ఫరూక్ అనే వ్యక్తి అరుదైన అలెగ్జాండర్ రామచిలుకల పిల్లలను పాతబస్తీలో కొనుగోలు చేసి మరో చోట అమ్మడానికి తరలిస్తుండగా దక్షిణ మండలం టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. హైకోర్టు రోడ్డులో టాస్క్ ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ఫరూక్ తన ద్విచక్ర వాహనంపై 110 రామచిలుకల పిల్లలను తరలిస్తూ పట్టుబడ్డాడు. రామచిలకలతో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకొని అరణ్య భవనంలోని ఫారెస్ట్ అధికారులకు అందజేశారు. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్), హెడ్ ఆఫ్ ఫారెస్ట్ ఫోర్స్ (హెచ్‌ఓఎఫ్ఎఫ్) ఆర్.ఎం. డోబ్రియల్ ఆదేశాల మేరకు పట్టుబడిన రామచిలుకలను నెహ్రూ జూ పార్కుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైల్డ్ లైఫ్ చట్టం 1972 ప్రకారం రామచిలుకలను వేటాడడం, వెంట ఉంచుకోవడం నేరం అన్నారు. రామచిలుకలు స్మగ్లింగ్ చేసినందుకు గానూ నిందితులకు మూడేళ్ల నుంచి 7 ఏళ్ల వరకు జైలు శిక్ష ఉంటుందన్నారు. పట్టుబడిన నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీఎఫ్(క్యాంప) సువర్ణ, ఏపీసీసీఎఫ్(అడ్మిన్) సునీత భగవత్, వైల్డ్ లైఫ్ ఓఎస్డీ శంకరన్,రంగారెడ్డి డీఎఫ్ఓ సుధాకర్ రెడ్డి, పీఆర్వో విజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం


పావురాన్ని ఎగరవేస్తున్న కార్పొరేటర్ రాషెద్ ఫరాజుద్దీన్

గోల్కొండ: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడుతాయని షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్ అన్నారు. మంగళవారం టోలిచౌకీ వీనస్ హైస్కూల్ వార్షిక క్రీడోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల కరస్పాండెంట్ మహ్మద్ హిదాయత్ అలీఖాన్‌తో కలిసి పావురాలను ఎగరవేశారు. అనంతరం మాట్లాడుతూ..గత రెండు దశాబ్దాలకు పైగా వీనస్ హైస్కూల్ వేలాది మంది విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దడం జరిగిందన్నారు. హిదాయిత్ అలీఖాన్ మాట్లాడుతూ..తమ వద్ద చదువుకున్న విద్యార్థులు నేడు దేశవిదేశాల్లో మంచి ఉద్యోగాలు చేస్తున్నారన్నారు.

కథా రచయిత్రులకు ఉచిత శిక్షణ

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాద్ సహకారంతో రసరంజని, సరసిజ (థియేటర్ ఫర్ ఉమెన్) హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం తెలుగు విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో 'నాటకం రాయడం ఎలా' అనే అంశంపై కథా రచయిత్రులకు ఉచిత శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరం మూడు రోజుల పాటు కొనసాగుతుంది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. డీ.ఎస్.ఎన్.మూర్తి, విజయ భాస్కర్ హాజరై ప్రసంగించారు. నాటకాన్ని రాసే విధానాన్ని విశదీకరించారు. పలు మెలుకువలు నేర్పించారు. అత్తలూరి విజయలక్ష్మి సమన్వయకర్తగా వ్యవహరించారు.


మాట్లాడుతున్న మామిడి హరికృష్ణ

టోలిచౌకీలో ఎమ్మెల్యే పర్యటన


టోలిచౌకీలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: టోలిచౌకీ చౌరస్తాను అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన టోలిచౌకీ చౌరస్తా, టూంబ్స్ రోడ్డు, నానల్‌నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. టోలిచౌకీ చౌరస్తా వద్ద ఫ్లై ఓవర్ పిల్లర్లకు ఉన్న ఆకర్షనీయమైన బొమ్మలు, ఆలోచింపజేసే విధంగా ఉన్న చిత్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన టోలిచౌకీ ఆలయం వద్ద జరుగుతున్న పైప్‌లైన్ పనులను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..నగరంలోనే అత్యంత ప్రధాన చౌరస్తాల్లో టోలిచౌకీ చౌరస్తా ఒకటన్నారు. టోలిచౌకీ ఫ్లై ఓవర్ కింది భాగానికి మరింత పచ్చదనం అద్దేందుకు ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రస్తుతం ఉన్న మొక్కలతో పాటు మరిన్ని ఔషధ మొక్కలను నాటి ఆకర్షనీయంగా వాటిని తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో నానల్ నగర్ కార్పొరేటర్ మోహ్మద్ నసీరుద్దీన్, టోలిచౌకీ డివిజన్ అధ్యక్షులు హారూన్‌ఫరాన్ తదితరులు పాల్గొన్నారు.

24న కవి సమ్మేళనం


గన్‌ఫౌండ్రీ: ఈ నెల 24న 'చేనేత కళా వెలుగులు' అనే అంశంపై రవీంద్రభారతిలో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు విద్యావేత్త, నిర్వాహకులు సూరెపల్లి రవికుమార్ తెలిపారు. చేనేత కళకు కవిత్వం ద్వారా మరింత ప్రాధాన్యత ఇచ్చేందుకు కవుల సృజనాత్మకతకు వేదికగా ఈ సమ్మేళనం నిలుస్తుందన్నారు. ఈ నెల 24న మధ్యాహ్నం ఒంటి గంటకు రవీంద్రభారతిలో నిర్వహించే కవి సమ్మేళనంలో పాల్గొనే వారు ఇతర వివరాలకు 63037 32862లో సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

ఆర్‌జేడీ విజయలక్ష్మికి సన్మానం



అబిడ్స్: విద్యాశాఖ ఆర్‌జేడీ విజయలక్ష్మిని టీఎన్జీఓస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్, కార్యదర్శి భాస్కర్, ఉపాధ్యక్షులు రవి, శ్రీరుగేష్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఆమెకు నూతన సంవత్సర కేలండర్లు అందజేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ..విద్యాశాఖ పటిష్టతకు ఉద్యోగుల కృషి అమోఘంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ శాస్త్రి, అనసూయ, ఇతర అధికారులు, నాయకులు సుదర్శన్, శ్రీకాంత్, చంద్రశేఖర్, రాజ్‌కుమార్, శశికాంత్, రమేష్, అరుణ, శంకర్ పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



గోల్కొండ: అనాథలు, నిరాశ్రయులకు సేవ చేయడంలో ఎంతో సంతృప్తి ఉందని సకీనా ఫౌండేషన్ చైర్మన్ మహ్మద్ ఆసిఫ్ హుస్సేన్ సోహెల్ అన్నారు. ఆయన మెహిదీపట్నం, గుడిమల్కాపూర్, టోలిచౌకీ లేబర్ అడ్డా తదితర ప్రాంతాల్లో అనాథలు, నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సేవా కార్యక్రమాలు ఒక ప్రాంతానికి పరిమితం కాలేదని, హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, సంగారెడ్డి, మెదక్‌లలో కూడా నిర్వహిస్తున్నామన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



విజయనగర్‌కాలనీ: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన మంగళవారం ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం..ఉషోదయ కాలనీలో సోమవారం రాత్రి ఓ గుర్తుతెలియని వ్యక్తి (40) పడిఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్న పరిశీలించగా అతడు అప్పటికే మృతిచెంది ఉన్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురికి తరలించి కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు.

విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సురేందర్

యాకుత్‌పురా: విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి మెరుగైన ఫలితాలు సాధించాలని ప్రభుత్వ నాంపల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్‌రెడ్డి సూచించారు. సుల్తాన్‌షాహిలోని ప్రభుత్వ శాలిబండ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు పరీక్షల సందర్భంగా తీసుకోవాల్సిన ముఖ్య అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ..పేదరికంతో ఇబ్బందులు ఎదుర్కొటున్న వారు చదువులో రాణించి తమ సత్తా చాట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు హరి నారాయణ, మాజీ ప్రధానోపాధ్యాయులు మల్లయ్య, ఉపాధ్యాయులు మధుసూదన్, డాక్టర్ విజయ్ భాస్కర్, అంజలీ, మంజుల, శ్రీదేవి పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఖేల్ మహోత్సవ్


స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ ప్రిన్సిపాల్ నాగేశ్వర్

జియాగూడ: ప్రతి సంవత్సరం ఖేల్ మహోత్సవ్ నిర్వహించి విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నట్లు శ్లోకా ది స్కూల్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ నాగేశ్వర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జియాగూడ శాంతినగర్‌లోని శ్లోకా ది స్కూల్‌లో ఖేల్ మహోత్సవ్ క్రీడల పోటీలను ఆయన ప్రారంభించారు. 21 నుంచి 23వ తేదీ వరకు నర్సరీ నుంచి 10వ తరగతి వరకు గల విద్యార్థులకు కబ్బడీ, ఖోఖో, రన్నింగ్ రేస్, చెస్, క్యారమ్స్, షాట్‌పుట్, డిస్కస్ త్రో, టెన్నిస్ తదితర ఆటలలో పోటీలు ఉంటాయన్నారు.

ముద్గర్ పోటీల విజేతలకు సన్మానం

గోల్కొండ: సబ్జిమండి గంగపుత్ర సంఘం వారు బాడీ బిల్డింగ్, రెజ్లింగ్‌లలో యువకులను ప్రోత్సహిస్తున్నారని గంగపుత్ర సంఘం సబ్జిమండి అధ్యక్షుడు దోర్నల శ్రీనివాస్ అన్నారు. ముద్గర్ అఖాడా వారు నిర్వహించిన పోటీల్లో 70, 97 కేజీల విభాగాల్లో పతకాలు సాధించిన వారిని మంగళవారం గంగపుత్ర సంఘంలో ఘనంగా సన్మానించారు. 70 కేజీల విభాగంలో కట్ట గణేశంకర్, 97 కేజీల విభాగంలో కట్ట సాయిశంకర్ విజయం సాధించి అందరి మన్ననలు పొందారు. వీరాభిమన్యు వ్యాయామశాలకు చెందిన కట్ట శంకరయ్య యువకులను మంచి తర్ఫీదు ఇస్తూ ప్రోత్సహిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కట్ట లింగం తదితరులున్నారు.



విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలకు ప్రాధాన్యమివ్వాలి


పురస్కార గ్రహీతలతో ఎమ్మెల్సీ మధుసూదనాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలకు ప్రాధాన్యత కల్పించాలని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం బషీర్‌బాగ్‌లో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం 5వ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల కోసం సంక్షేమాని కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, చేతివృత్తిదారులకు పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. శాసన మండలి సభ్యులు మధుసూదనాచారి మాట్లాడుతూ..విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలు ఎదుర్కొంటున్న సమస్యలను మండలిలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీనిచ్చారు. అనంతరం సీనియర్ శిల్ప కళాకారులకు అమర శిల్పి జక్కన్నాచార్య, విశ్వ శిల్పి రామప్ప పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు లాలుకోట వెంకటచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, కోశాధికారి రవీంద్రచారి, పులిగిళ్ల శ్రీనివాసచారి, పి.బిక్షపతి, దేవరకొండ వీరాచారి, రాళ్లబండి విష్ణుచారి పాల్గొన్నారు.

దశలవారీగా అభివృద్ధి చేస్తున్నాం


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: తలాబ్‌చంచలం డివిజన్‌ను దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. చాచాగ్యారేజ్, భవానీనగర్, తలాబ్‌కట్టా ప్రాంతాంలో రూ.27 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులు మంగళవారం ఆయన కార్పొరేటర్ సమీనా బేగంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రజా సమస్యల పరిష్కారానికి నిత్యం బస్తీలలో పర్యటిస్తున్నామన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మజ్లిస్ నాయకులు, జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇప్పించాలి


పురస్కార గ్రహీతలతో సతీష్ మనోహర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే కరాటే, మార్షల్ ఆర్ట్స్‌లల్లో శిక్షణ ఇప్పించాలని హైకోర్టు న్యాయవాది సతీష్ మనోహర్ అన్నారు. మంగళవారం ఆదర్శ్‌నగర్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో కేశవ్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లికి చెందిన ఆర్‌కే కరాటే అకాడమీకి చెందిన మాస్టర్ ఎం.రాజ్‌కుమార్ ఉత్తమ మాస్టర్‌గా పురస్కారాన్ని అందుకోగా అతని శిష్యులు భువన్‌తేజ, ఎం.రిషి కుమార్, అభిరామ్, కారుణ్య, భువన్‌లు బాల పురస్కారాలను అందుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఈ పురస్కారాలు మనలోని ప్రతిభకు ప్రోత్సాహాన్ని ఇవ్వడంతో పాటు ఇతరులకు స్ఫూర్తిని కలిగిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ వ్యవస్థాపకులు కేశవ్‌గౌడ్, సీహెచ్ మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేస్తాం


శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

సుల్తాన్‌బజార్: గన్‌ఫౌండ్రీ డివిజన్‌లో బీజేపీని బలోపేతం చేస్తామని ఆ డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు మంగళవారం గన్‌ఫౌండ్రీ డివిజన్ అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీకాంత్‌ను ఆ డివిజన్ బీజేవైఎం ప్రెసిడెంట్ తోటకూర విజయ్‌కుమార్, మోతీమార్కెట్ యువసేన నాయకులు చింటు, రాహుల్, గణేష్, కార్తీక్, నాని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. డివిజన్‌లో ప్రజల సమస్యలపై పోరాడుతామన్నారు. అర్హులైన అందరికీ రేషన్‌కార్డులు, ఇతర సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఓ వైపు సుందరీకరణ.. మరో వైపు అక్రమ పార్కింగ్..

చాంద్రాయణగుట్ట ఫ్లై ఓవర్‌కు వేసిన రంగులు



ఫ్లై ఓవర్ కింద డీసీఎం వ్యాన్‌ల అక్రమ పార్కింగ్



నగరంలోని ఫ్లై ఓవర్లకు జీహెచ్ఎంసీ కోట్లాది రూపాయలు వెచ్చించి చూడ చక్కని రంగులద్దుతూ సుందరీకరణ పనులు చేపడుతుంటే చాంద్రాయణగుట్టలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. ఈ ఫ్లై ఓవర్ సైడ్ గోడలు, పిల్లర్లకు ఓ వైపు రంగులద్దుతుండగా..మరో వైపు కొందరు వ్యాపారులు డీసీఎంలను అడ్డగోలుగా ఫ్లై ఓవర్ కిందనే అక్రమ పార్కింగ్ చేస్తూ అపరిశుభ్రంగా మారుస్తున్నారు. ఈ పార్కింగ్ కారణంగా పిల్లర్లకు వేసిన రంగులు సైతం కనిపించకుండా అడ్డంకిగా మారాయి. జీహెచ్ఎంసీ చేపట్టిన ఈ సుందరీకరణ పనుల లక్ష్యానికి.. ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం తూట్లు పొడిచినట్లుగా మారింది. – చాంద్రాయణగుట్ట